క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హనుమాన్ నగర్, చాణక్యపురి, అల్కాపురి, పోస్టాఫీస్, బ్యాంక్ కాలనీ, లింగోజిగూడ, శివపురికాలనీ, భగత్‌సింగ్‌నగర్, జే.బీ.కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, 11కేవీ సిరినగర్, శివగంగకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం మధ్యాహ్నం 12గంటల వరకు, 11కేవీ స్టేడియం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, 11కేవీ ఇందూ అరణ్య ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, 11కేవీ దుర్గానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

శాంతి భద్రతలు పరిరక్షించాలి

నూతన డీసీపీకి మంత్రి సూచన



మంత్రి సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీపీ శ్రీనివాస్

మహేశ్వరం: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన మహేశ్వరం జోన్ మొదటి లా అండ్ ఆర్డర్ డీసీపీ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్)గా నియమితులైన చింతమనేని శ్రీనివాస్ బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మహేశ్వరం డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని మంత్రి నూతన డీసీపీకి సూచించారు. అనతరం ఆమె డీసీపీని అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను సన్మానిస్తున్న జిల్లా పంచాయతీ సెక్రటరీ ఫోరమ్ సభ్యులు

తుక్కుగూడ: జిల్లా పంచాయతీ సెక్రటరీ ఫోరమ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శ్రీకాంత్‌గౌడ్, శిధర్‌రెడ్డి, నర్సింహ, రఘు, రాంబాబు, సుజాత, ఇందిరా, రాజుగౌడ్, శ్రీనివాస్, వెంకటేశం, నరేందర్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ బదిలీలను ఆపాలి'

ఇబ్రహీంపట్నం: ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాలోకి అక్రమ బదిలీలను ఆపాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి పీఆర్టీయూటీఎస్ నేతలు విన్నవించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు సంఘం మండల అధ్యక్షుడు వర్కాల పరమేష్, రాజు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. దొడ్డిదారిన రంగారెడ్డి జిల్లాకు బదిలీలు చేయించుకోవాలని కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ బదిలీలను ఆపి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుల హక్కులను కాపాడాలన్నారు. జీఓ 317 ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన స్థానిక ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాలకు రప్పించాలని విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

తుర్కయంజాల్: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కాంగ్రెస్ నేత మల్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ, ఇంజాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మల్రి నిరంజన్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా.. ఆయన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొక్క శ్రీలత, ప్రధానోపాధ్యాయులు సిమ్లానాయక్, జ్యోతి, నాయకులు సామ భీంరెడ్డి, మేతరి దర్శన్, ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కడ్తాల్: కొలుకులపల్లి రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ అభివృద్ధి పనులకు గ్రామానికి చెందిన ఆకుతోట రాములు జ్ఞాపకార్థం.. ఆయన సతీమణి భారతమ్మ, కుమారుడు శ్రీనివాస్ రూ.51 వేలు, దుర్గామాత ఆలయ అభివృద్ధికి రూ.11 వేల విరాళం ప్రకటించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి రామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.10,100 విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డికి విరాళం అందజేశారు. స్థానిక నాయకులు ఉన్నారు.

రోడ్డు మెరిసె.. జనం మురిసె

ప్రగతిలో రహదారుల పాత్ర ప్రధానమైనది. ఇటీవల ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రోడ్ల నుంచి హైవేల వరకు రహదారుల మరమ్మతులు చేపడుతోంది. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయి.

- రూ.19కోట్ల నిధులతో అభివృద్ధి పనులు
- త్వరలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు



నూతనంగా నిర్మించిన బడంగ్‌పేట-నాదర్‌గుల్ రోడ్డు

బడంగ్‌పేట్: కొంత కాలంగా రహదారి విస్తరణ పనులు నిలిచిపోయి కార్పొరేషన్ పరిధిలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. వ్యాపారసముదాయాలు కూల్చడంతో సమస్య మరింత జటిలంగా మారింది. విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల పనులు ప్రారంభించడంతో కొంత ఉపశమనం లభించింది. రూ.19కోట్ల నిధులతో బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. బడంగ్‌పేట్ కమాన్ నుంచి పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్ వరకు ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. కొత్త మున్సిపల్ కార్పొరేషన్ నుంచి నాదర్‌గుల్ వరకు ఉన్న రోడ్లను కూడా నాలుగులైన్లకు విస్తరించి అభివృద్ధి చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వరకు విస్తరణ పనులు పూర్తైన వెంటనే డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దుతామంటున్నారు. ఇప్పటికే స్తంభాల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. గాంధీ నగర్ తర్వాత ప్రధాన రోడ్డు అధ్వానంగా మారిందని ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేసి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాఫీగా ప్రయాణం



నిన్నటి వరకు ఇరుకైన రోడ్లతో ఇబ్బంది పడ్డాం. సింగిల్ రోడ్లు వేసి వదిలేయడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండేది. నాలుగులైన్లుగా రోడ్డు పూర్తి చేయడంతో ఇబ్బందులు తీరాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు.

– బంగారు బాబు, బడంగ్‌పేట

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సూర్యనారాయణ, రామలింగేశ్వర, ఆంజనేయస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. రాజుశర్మ సమక్షంలో బ్రాహ్మణులు మంత్రోచ్ఛరణల నడుమ హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ గురూజీ అనిల్ కుమార్‌జోషి ప్రత్యేకంగా హాజరై పూజలు నిర్వహించారు. శంకుస్థాపన పూజలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, ఎల్మటి దేవేందర్‌రెడ్డి, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొక్క జ్యోతి, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన పూజలో సబితారెడ్డి, అనితారెడ్డి తదితరులు

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు



రక్తదానం చేస్తున్న యువకులు

తుక్కుగూడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం ఐ రైస్ అకాడమీ వ్యవస్థాపకుడు రాజశేఖర్ జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఏఎస్పీ పి.విజయ్‌కుమార్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్, డాక్టర్ పాండుగౌడ్, రఘూమారెడ్డి, శైలేశ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

కరిగిపోని వ్యర్థాలతో పుడమికి నష్టం

మేయర్ పారిజాత



మేయర్ పారిజాతకు మొక్క అందజేస్తున్న ప్రిన్సిపాల్ సుప్రభ హనీ

బడంగ్‌పేట్: భూమిలో కరిగిపోని వ్యర్థాలను వాడుతూ పుడమి వినాశనానికి కారణమవుతున్నామని.. అందరం కలిసికట్టుగా భూమిని కాపాడుకుందామని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పిలుపునిచ్చారు. బుధవారం మౌంట్ కార్మెల్ గ్లోబల్ పాఠశాలకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. భారత భూమిని కాపాడుకుందామని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ పారిజాత, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. పాఠశాల నుంచి వారికి మొక్కలను అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అడవులను నరికివేయడంతో పర్యావరణ విఘాతం కలుగుతోందన్నారు. వాయు, జల కాలుష్యాలకు పాల్పడి ప్రకృతి పాడవుతుందన్నారు. పుడమిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ప్రిన్సిపాల్ సుప్రభహనీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం



కంటి అద్దాలు అందజేస్తున్న నేతలు

కార్పొరేటర్ బీరప్ప పిలుపు

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప సూచించారు. బుధవారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్‌తో కలిసి బీరప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దృష్టి లోపం ఉన్న వారికి కంటి అద్దాలు అందజేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి మాట్లాడుతూ.. కంటి జబ్బులతో బాధపడుతున్న వారి కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగుకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ యాదవ్, ఆర్ఎన్ రెడ్డి నగర్, లక్ష్మీనగర్ కాలనీ, ద్వారకామయినగర్ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో దాతునగర్ కాలనీలో రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని దాతూనగర్ కాలనీలో సుజాతానాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాతూనగర్ కాలనీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, వారి భాగస్వామ్యంతోనే పనులు త్వరితగతిన పూర్తవుతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేపాక ప్రభాకర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌రావు, రాజేందర్, రవీందర్‌గౌడ్, శశి, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

వనస్థలిపురం: తెలంగాణ హిందీ కవి, వనస్థలిపురానికి చెందిన గుండాల విజయకుమార్ జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. హిందీ సాహిత్యంలో ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. విజయకుమార్ హిందీ సాహిత్యంలో 3 స్వీయ పుస్తకాలు, 25 సహ పుస్తకాలు రచించారు. ఆయన జాతీయ స్థాయిలో 50కి పైగా అవార్డులు పొందారు. ఈ నెల 5న ఢిల్లీలో అవార్డు ప్రదానం చేయనున్నారు.

6 నుంచి ప్రత్యంగిరాదేవి ఆలయ బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: శ్రీరామకృష్ణాపురంలో కుర్తాళం సిద్ధేశ్వరి పీఠ విభాగ ఆదిపరాశక్తి ప్రత్యంగిరా దేవి మందిరం వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు జరుగుతాయని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, యాగ మండప దేవత హోమాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం అమ్మవారికి విశేష అలంకరణ, భక్తి సంగీతం, రాత్రి మహా నక్షత్ర హారతులు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు బుధవారం ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం, సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పార్కు స్థలాలు కబ్జా

అధికారులు అక్రమార్కులకు వంతపాడుతున్నారు: బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో కోట్ల విలువచేసే పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. కాపాడాల్సిన అధికారులు అక్రమార్కులకే వంతపాడుతున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు బుధవారం అల్మాస్‌గూడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖనగర్‌లో సుమారు వంద ఎకరాల్లో లేఅవుట్ చేయగా అందులో నాలుగుచోట్లల్లో కలిపి 8,361 గజాల పార్కు స్థలాలను వదిలారు. భూముల రేట్లు పెరగడంతో రెండేళ్లుగా వాటిని కబ్జా చేసి అమ్ముకుని కోట్లు గడిస్తున్నారని ఆధారాలతో సహా చూపారు. వాటిని కాపాడాలని అదనపు కలెక్టర్, అదనపు రెవెన్యూ కలెక్టర్, బాలాపూర్ తహసీల్దార్, బడంగ్‌పేట కార్పొరేషన్ కమిషనర్‌కు రెండేళ్లుగా వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నామన్నారు. అధికారులు మాత్రం అధికార పార్టీకి అనుకూలంగా ఉంటూ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇదే విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆమె పార్కులను కార్పొరేషన్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని అధికారులను ఆదేశించినా నేటికీ పట్టించుకునే వారే లేరన్నారు. ఇప్పటికైనా మేయర్ స్పందించి పార్కు స్థలాల చుట్టూ కంచె వేయించాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకుంటే పదిరోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ బూత్ కమిటీ అధ్యక్షుడు రామిడి శూరకర్ణారెడ్డి, నాయకులు శ్రీధర్, శివరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి



అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఏబీవీపీ నగర కార్యదర్శి రాఘవేందర్

మహేశ్వరం: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి జె.రాఘవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలనే డిమాండ్‌తో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బకాయిలు సకాలంలో విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5,500 కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, మురళి, రాజేశ్, సాయితేజ, వినయ్, చంటి, బీజేపీ నాయకుడు దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.

11న సరూర్‌నగర్ స్టేడియంలో మెగా జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేశ్

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ స్టేడియంలో 120 కంపెనీలతో ఈ నెల 11న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్ మేళాలో 120 (టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటీ, నాన్ ఐటీ) కంపెనీల ప్రతినిధులు హాజరై 10,000 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 7వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగ యువతతో పాటు దివ్యాంగులు, మూగ, చెవిటి, అంధులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7286008234, 9505437112, 8247768371 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, దేరింగుల కృష్ణ, రామ్ కల్యాణ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శేషగిరి రావు, నరేందర్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

కౌన్సిలర్ శివకుమార్



పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శివకుమార్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని కౌన్సిలర్ వై.శివకుమార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు పరిధిలో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది శివ, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం'

హస్తినాపురం: అర్హులందరికీ ఇళ్లు, స్థలాలను కేటాయించాలని సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేట ఎల్లయ్య అన్నారు. బుధవారం కర్మన్‌ఘాట్‌లో జరిగిన తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. దళితబంధు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో ప్రజలను మోసం చేసిన కేసీఆర్‌కు ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో చిప్పలపల్లి అంజయ్య, నల్ల చంద్రమ్మ, అంజమ్మ, పద్మ, యాదమ్మ, జాన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి
- రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం రూరల్: యేండ్ల తరబడిగా భూములు సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడే జంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం హఫీజ్‌పుర రెవెన్యూ రైతులు బుధవారం ఈ మేరకు నిరసన చేపట్టారు. ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ... హఫీజ్‌పుర రెవెన్యూ సర్వేనం 36 నుంచి 48లో 450 మంది సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నరన్నారు. వారికి నేటికి పట్టాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. దీనికితోడు వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతు సంఘం రైతుల పక్షాన నిలబడుతుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం కార్యదర్శి ముసలయ్య, అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు వెంకటేష్, గుడెటి వెంకటేష్, రవీ, లింగస్వామి, నాగేశ్వర్‌రావు, రమేష్, యాదగిరి, మంకు జంగయ్య, లింగం పాల్గొన్నారు .